క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చింతపల్లి: మండల కేంద్రంలోని సకలదేవతల ఆలయం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కుంకమ పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, బేతాలుడు, వినాయకరావు, రమణ తదతరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ముంచంగిపుట్టు: సమ్మర్ క్రాష్ కార్యక్రమం ద్వారా మండల కేంద్రంలోని పాడైన చేతిబోరుకు మరమ్మతు పనులు చేయించినట్టు ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్ చెప్పారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరం


భీరం గ్రామంలో సారాకు వ్యతిరేకంగా కళాజాత ప్రదర్శన

జి.మాడుగుల: సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని పాడేరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.వి.వి.ఎస్.ఎన్.ఆచారి చెప్పారు. మండలంలో బుర్రతాడి, భీరం గ్రామాల్లో ఎక్సైజ్, ప్రోహిబిషన్ ఆధ్వర్యంలో సారా నిర్మూలనపై శుక్రవారం గ్రామ సభలు ఏర్పాటు చేసి కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని అందరూ సహకరించాలని సూచించారు. సారా వల్ల కలిగే అనర్థాలపై కళాకారులు నాటక రూపంలో ప్రదర్శించారు. సిబ్బంది, మహిళా పోలీస్, డ్వాక్రా మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న స్త్రీనిధి మేనేజర్ కృష్ణారావు

చింతపల్లి: డ్వాక్రా మహిళలు వెలుగు ద్వారా తీసుకున్న రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని స్త్రీనిధి మేనేజర్ బోనంగి కృష్ణారావు అన్నారు. స్థానిక చాడీపేట గ్రామ సమాఖ్య సంఘ డ్వాక్రా సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా వెలుగు ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని 42 గ్రామ సమాఖ్య సంఘాల్లో ఉన్న డ్వాక్రా సంఘ సభ్యులకు ఈ ఏడాది రూ.3.30 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. రుణాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలన్నారు. బంగారమ్మ, హేమలత పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి


మాట్లాడుతున్న నాయకుడు నాగేశ్వరరావు

ఎటపాక: మండలంలోని మాధవరావుపేట గ్రామంలో శుక్రవారం జరిగిన సీపీఎం కమిటి సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ గుండాల గోదావరి నది నుంచి తెలంగాణాకు తరలిస్తున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. గుండాల వద్ద అధికారికంగా రెండు ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నా అక్రమార్కులు గోదావరి నదికి ర్యాంపు వేసుకుని ప్రొక్లెయిన్‌తో ఇసుకను లారీల్లో నింపి తెలంగాణాకు రాత్రి వేళల్లో తరలిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు నిఘా ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అర్జున్‌దొర, ఐవి, బాలకృష్ణ, అజయ్, భద్రయ్య, రత్తమ్మ, హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


గంగవరంలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, జెడ్పీటీసీ బేబీరత్నం తదితరులు


కోట గ్రామంలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, గామస్తులు తదితరులు


చింతపల్లిలో పాల్గొన్న ఉపాధ్యాయులు తదితరులు


దుంబ్రిగుడలో మహిళలకు బహుమతులు అందజేస్తున్న కృష్ణకుమారి


వర్తనపల్లిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ ప్రతినిధులు

దుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ర్యాలీలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో చీరలు పంపిణీ చేశారు. ఉత్తమ సేవలందించిన మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు, సీఐ, ఎస్‌ఐలు, సీడీపీవోలు, ఇతర ఉన్నతాధికారులు, ప్రముఖులు మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. మహిళల హక్కులను నేటి పాలక వర్గాలు కాలరాస్తు తుంగలో తొక్కాయని విమర్శించారు. ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాల వల్ల రోజురోజుకు మహిళలపై హత్యలు, అత్యాచారాలు వంటి ఆకృత్యాలు పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. మహిళలకు పూర్తి రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళలు పోరాటల ద్వారానే హక్కులను, చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దుంబ్రిగుడలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.రాష్ట్ర మానవ హక్కుల నేర నిరోధక సంఘం మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణ కుమారి , హ్యూమన్‌రైట్ ఏసీపీ ఏజెన్సీ కో–ఆర్డినేటర్ రవీంద్ర, శృతిపల్లవి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని జరిగిన వేడుకలో సీఐ సన్యాసినాయుడు, సీడీపీవో బాలచంద్రమణిదేవి, ఎంఈవో చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: మండలంలో వర్తనపల్లిలో జరిగిన వేడుకలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సింహచలం, నాగరాజు, మణి, మత్స్యకొండమ్మ, విజయరాణి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మినుములూరులో నేడు మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డేవిడ్ చెప్పారు.

చింతపల్లి: మండల కేంద్రంలో జరిగిన వేడుకలో ఎంఈవో పి.ప్రసాద్, పీఆర్‌టీయూ నాయకులు గిరి, వరలక్ష్మి, మత్స్యలింగం, సంజీవరావు, వెంకటరమణమ్మ, ఉత్తరకుమారి,యశోద,కృష్ణకుమారి, గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలో జరిగిన వేడుకలో జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, సీడీపీవో సీహెచ్.లక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారి భావన, ఎంఈవో–2 మల్లేశ్వరరావు, సిద్దేశ్వరరావు, రాంబాబు, సత్యవతి పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలో జరిగిన వేడుకలో ప్రగతిశీల మహిళాసంఘం ప్రతినిధులు సంగీత, అఖిలభారత కార్మిక సంఘాల సమైక్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, ఏపీ రైతుకూలీసంఘం డివిజన్ కార్యదర్శి సురేష్, పాము దేవి, నాయకులు రత్నం, సావిత్రి, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ


నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

వి.ఆర్.పురం: మండలంలోని రామవరంపాడు గ్రామాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల తాటాకిల్లు దగ్ధమైన సంఘటనలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు, రూ.2వేల నగదును యాదవ సంఘం మండల అధ్యక్షుడు మోడెం సురేష్ శుక్రవారం అందజేశారు. ముత్యాలరావు, గోపాలరావు, బాబురావు, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గూడెంకొత్తవీధి: రింతాడ గ్రామ సచివాలయాన్ని తహసీల్దారు రామకృష్ణ ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయంలో పలు ధ్రువపత్రాలు ఆన్‌లైన్ చేయకుండా ఉన్నట్టు ఆయన గుర్తించారు. దీనిపై కారణాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వివిధ పథకాలు, విద్యార్థులకు అవసరమయ్యే ధ్రువపత్రాలను అవసరమైన వారికి సత్వరమే అందజేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుంబ్రిగుడ: మండలంలోని అరకు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రజావసరాలను సకాలంలో తీర్చి వారికి తోడ్పాటుకావాలని సూచించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి


లక్ష్మీపురం గ్రామ గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జి.మాడుగుల సీఐ శ్రీనివాసు గ్రామస్తులతో మాట్లాడి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి వచ్చిన బుంగాపుట్టు, లక్ష్మీపురం, బరడ పంచాయతీల గిరిజనులు మాట్లాడుతూ ఆయా పంచాయతీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మూడు పంచాయతీలకు చెందిన 60 గ్రామాల గిరిజనులు వారపు సంతలకు, అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళ్లేందుకు, మండల కేంద్రానికి, ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వాహనాలు అప్పుడప్పుడు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయన్నారు. పాడేరు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ముంచంగిపుట్టు నుంచి బుంగాపుట్టు పంచాయతీ కేంద్రం వరకు బస్సు సర్వీసును నడపాలని వారు సీఐను కోరారు. దీనిపై స్పందించిన సీఐ శ్రీనివాసు మాట్లాడుతూ బుంగాపుట్టుకు బస్సు సౌకర్యంపై జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులకు దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీసుశాఖ నిరంతరం గిరిజనుల అభివృద్ధి కోసం పని చేస్తుందని, గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనారోగ్య బారిన పడిన వారికి సైతం తక్షణమే వైద్యం అందించేలా చూస్తామన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ


పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దాతలు

రంపచోడవరం: మండలంలోని పెద్దగెద్దాడ పీహెచ్‌సీలో రామకృష్ణ మిషన్ (రాజమండ్రి) ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఆర్థిక సాయంతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద జీ మహారాజ్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహార కిట్లును, మందులు అందజేశామన్నారు. తల్లులకు బిడ్డల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ ఆర్.వినోద్‌కుమార్, కె.శ్వేతదేవి, మాజీ జెడ్పీటీసీ వై.వెంకట రామకృష్ణ(బాలాజీ శ్రీను), బి.సూరిబాబు, స్వామి రఘువీరనందజీ మహారాజ్, రిటైర్డ్ వైద్యాధికారి జి.రామారావు, మిషన్ క్యాంప్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

టార్పాలిన్‌లు పంపిణీ


కాఫీ రైతులకు టార్పాలిన్‌లను అందజేస్తున్న జీసీసీ మేనేజర్ కొండబాబు

జి.మాడుగుల: గిరిజన సహకార సంస్థ(జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్ కల్పనకుమారి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు 100 కిలోల కాఫీని జీసీసీకి అమ్మకాలు చేసి గిరిజన రైతులకు శుక్రవారం ఉచితంగా టార్పాలిన్‌లను జీసీసీ ఎంఎస్ బ్రాంచి మేనేజర్ కొండబాబు పంపిణీ చేశారు. మండలంలో చిన్నబందవీధి, పి.జి.మాడుగుల,నేరేడువలస, అరగడాపల్లి, కోరాపల్లి గ్రామాల్లో కాఫీ రైతులను టార్పాలిన్లను అందజేశారు.గిరిజన రైతులు పండించిన నాణ్యమైన పార్చిమెంట్ కాఫీని జీసీసీకి విక్రయించాలని ఆయన కోరారు. 100కిలోల పైబడి కాఫీని అమ్మకాలు చేసిన వారిని గుర్తించి జీసీసీ ఉచితంగా టార్పాలిన్లు అందజేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది నిరీక్షణరావు, కళ్యాణ్, పంతులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

9న జేఏసీ సమావేశం

చింతూరు: ఆదివాసీ చట్టాలు, హక్కులను అమలుచేయాలని కోరుతూ ఈనెల 9న చింతూరులో జరిగే ఆదివాసీ జేఏసీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ కోరారు. చింతూరులో జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజన్సీలో గిరిజనేతరుల వలసలు పెరుగుతూ ఆదివాసీలకు అండగా ఉంటున్న చట్టాలను, స్థానిక ప్రజాప్రతినిధులతోనే తొలగించే విధంగా కుట్ర చేస్తున్నారని, దీనిని అందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసీలకే దక్కేలా చట్టం చేయాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నేతలు ఎస్.నారాయణ, సీతారామయ్య, రామకృష్ణరాజు, రాఘవయ్య పాల్గొన్నారు.

11న జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక

పాడేరు : అఖిలపక్ష, గిరిజన, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులను అందర్ని కలుపుకొని 11న పాడేరులో ఆదివాసీ జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు చిన్నీ, సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పాడేరులో అఖిలపక్ష, గిరిజన, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యపై అవగాహన


విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్యపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అడ్డతీగల: పదవ తరగతి తరువాత సాంకేతిక విద్య చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు తెలుసుకోవాలని రంపచోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వామిరెడ్డి అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్య ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధి పొందేందుకు పాలిటెక్నిక్ విద్య దోహదపడుతుందన్నారు. దీని ద్వారా ఉన్నత సాంకేతిక విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలన్నారు. పరిశ్రమల్లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. రంపచోడవరం, ఎటపాక, పాడేరు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయన్నారు. పాలిటెక్నిక్ విద్య వల్ల కలిగే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గంగవరం ,అడ్డతీగల మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఉన్నత విద్యపై ప్రత్యేక దృష్టి

హుకుంపేట: విద్యార్థులు బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరాలని డాక్టర్ వైఎస్సార్–టీఎస్‌సీర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ తెడబారికి సురేష్ కుమార్ చెప్పారు. అల్లంపుట్టు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి రూ.10వేలు బహుమతి అందజేస్తామన్నారు. హెచ్‌ఎం వేణుగోపాలరావు, సర్పంచ్ రంజిత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11 నుంచి సీపీఎం పోరుయాత్ర

వి.ఆర్.పురం: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేది నుంచి ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నిర్వాసితులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంటూరులో నిర్వాసితులకు నేటి వరకు పూర్తి ప్యాకేజీ పరిహారం ఇవ్వలేదన్నారు. బాధితులకు అండగా నిలిచి వారి తరపున న్యాయ పోరాటాలు చేస్తామన్నారు. నాయకులు రాజులు, చినబాబు, శ్రీరామ్మూర్తి, రమేష్, రాజు , లక్ష్మణరావు, సత్యనారాయణ, బాబూరావు, సత్తిబాబు, బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


కొక్కిరాపల్లిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామంలో ఈ నెల 19 నుంచి 20వ తేదీ వరకు కొక్కిరమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎస్ఐ షణ్ముఖరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, యువత క్రీడల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు జాతరలు, ఉత్సవాలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. ఎంపీటీసీలు ఈశ్వరరావు, అప్పారావు, మాజీ సర్పంచ్ భాస్కరరావు, వైస్ సర్పంచ్ రామస్వామి, నాయకులు మత్స్యరాజు, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనిలో వృద్ధురాలికి గాయాలు


చికిత్స పొందుతున్న లక్ష్మి

రాజవొమ్మంగి: తంటికొండ గ్రామానికి చెందిన లక్ష్మి అనే వృద్ధురాలు ఒట్టిగెడ్డలో చెరువు పను లు చేస్తుండగా మట్టిపెళ్లలు విరిగిపడి గాయాలయ్యాయి. ఆమెను పీహెచ్‌సీకు తరలించగా ప్రథమ చికిత్స అందజేశారు. ఆమెకు ఎడమ చేయి ఫ్రాక్చర్ అయినట్టు వైద్యులు తెలిపారు. నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. పేద కుటుంబానికి చెందిన లక్ష్మిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

పూడికతీత పనులు చేయాలి

గంగవరం: గంగవరం , రంపచోడవరం ఏజె న్సీ మండలాల్లో తూ ర్పుగోదావరి జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శుక్ర వారం పర్యటించారు. ఇందులో భాగంగా సూరంపాలెం ప్రాజెక్టును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూపతి పాలెం ప్రాజె క్టు నుంచి సూరంపాలెం ప్రాజెక్టుకు సాగునీరు అందిస్తే రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. కాలువలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ప్రాజెక్ట్ చైర్మన్ రాము, కొండబాబు, అప్పలరాజు నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై పోరుబాట

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న మహాధర్నాను కూటమి ప్రభుత్వం అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుందని ఇది తగదని నాయకుడు కె.శంకర్‌రావు చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత, వేతన పెంపు తదితర విషయాలపై చేపట్టనున్న చలో విజయవాడ పేరుతో చేపట్టనున్న ధర్నాను ప్రభుత్వం అడ్డుకోవడం తగదన్నారు.

బాలికా వికాసంపై అవగాహన


జీకే వీధిలో విద్యార్థుల ప్రదర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న సీడీ పీవో నీలిమ


మారేడుమిల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీడీపీవో ప్రసన్న


కొయ్యూరులో గ్రూపులుగా ఏర్పడిన విద్యార్థులు


కూనవరంలో మాట్లాడుతున్న సర్పంచ్ సున్నం అభిరామ్


అడ్డతీగల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సిడిపిఓ సిహెచ్.లక్ష్మి

దుంబ్రిగుడ/కొయ్యూరు/గూడెంకొత్తవీధి/గంగవరం /అడ్డతీగల/మారేడుమిల్లి/కూనవరం: జిల్లాలో పలు కిశోర బాలికా వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాలల్లో విద్యార్థులకు బాలిక సంరక్షణ, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. లక్ష్యంతో సాధన చేసి ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. దుంబ్రిగుడలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో నీలిమ, కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.భవాని తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరు మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో రాంబాబు, ఎంపీడీవో ప్రసాద్, సీడీపీవో విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. గూడెంకొత్తవీధి మండలంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. గంగవరం మండలంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్.లక్ష్మి, భవాని, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. అడ్డతీగలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మారేడుమిల్లిలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో ప్రసన్న విశ్వనాథ్, తహసీల్దార్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. కూనవరం మండలంలోని జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ అభిరామ్, హెచ్‌ఎం సతీష్, పంచాయతీ కార్యదర్శి మణికంఠ, మహిళా పోలీసు రమ్య తదితరులు పాల్గొన్నారు.